క్లుప్తంగా

ప్రభుత్వ బడుల్లో ఉత్తమ బోధన

కోనేరుసెంటర్: ప్రభుత్వ బడుల్లో ఉత్తమ విద్యా బోధన జరుగుతోందని పెదపట్నం సర్పంచ్ గడిదేసి అనూష అన్నారు. పెదపట్నం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత విద్య అభ్యసించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. పిల్లలకు ఉత్తమ బోధన అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ బాల జేసు మాట్లాడుతూ బడులు బాగుపడాలన్నా, బడిలో పిల్లలు బాగుపడాలన్నా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సమన్వయం అవసరమని చెప్పారు. ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణా వీసీకి బీసీ సంఘం నేతల సన్మానం



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి రామ్మోహనరావును కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం సన్మానించారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సకాలంలో మార్కుల లిస్టును అందజేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఇటీవల వీసీకి వినతి పత్రం సమర్పించారు. స్పందించిన వీసీ డిగ్రీ విద్యార్థులకు వెంటనే మార్కు లిస్టులు అందజేసేలా చర్యలు తీసుకున్నారు. తమ అభ్యర్థనపై వెంటనే స్పందించిన వీసీని అభినందిస్తూ సంఘ నాయకులు ఆయనను సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షుడు తోట బాబు, సంఘ సభ్యులు విశ్వనాథపల్లి సుబ్రహ్మణ్యం, పొట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కోడూరు: కృష్ణా మిల్క్ యూనియన్ పాలకేంద్రం సభ్యుడిగా ఉంటూ ఇటీవల విశ్వనాథపల్లి గ్రామంలో మృతిచెందిన దూళిపూడి పోతురాజు కుటుంబ సభ్యులకు యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. పోతురాజు భార్య విజయలక్ష్మికి రూ.50 వేల చెక్కును పాలకేంద్రం అధ్యక్షుడు తోట హరిబాబు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



నడకుదురు(చల్లపల్లి): గ్రామంలో 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గౌడపాలెం ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టామని నడకుదురు సర్పంచ్ గోరిపర్తి సురేష్‌బాబు అన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంజూరు చేసిన నిధులు రూ.10 లక్షలతో నడకుదురు గౌడపాలెం ప్రధాన రహదారి నిర్మాణ పనులను సర్పంచ్ సురేష్‌బాబు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి హరిబాబు, వార్డు సభ్యురాలు జంపాన కోటేశ్వరమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీ శేఖర్ బదిలీ

చిలకలపూడి(మచిలీపట్నం): సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌గా పనిచేసిన ఎ. శేఖర్ బదిలీ అయ్యారు. ఈ మేరకు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో కలెక్టర్ పి. రాజాబాబు బీసీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న ఎ. శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. బదిలీ అయిన శేఖర్‌ను క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. శేఖర్‌ను కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం

ఉయ్యూరు: దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య చర్యలు చేపడితే వ్యాధులు దరిచేరవని మలేరియా అధికారి సర్వారాయుడు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్వారాయుడు మాట్లా డుతూ.. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు వ్యాప్తిచెందవన్నారు. ఫ్రైడే డ్రైడే విధిగా పాటించాలని సూచించారు. మలేరియా, డెంగీ, ఫైలేరియా మొదలైన వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, అంకిరెడ్డి, హెచ్ఎం శారద, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ తుమ్మల సుధాకర్ రావు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో అందరికీ మేలు

- కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవాలి
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



కోడూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



పెడనలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ ఖాజా, అధికారులు

కోడూరు: అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం కోడూరు, ఉల్లిపాలెం సచివాలయాల వద్ద వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రమేష్‌బాబు అన్నారు. గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టడంతో పాటు వలంటీర్లు ప్రతి ఇంటికి తప్పనిసరిగా వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. అలాగే గతంలో తిరస్కరించిన దరఖాస్తుల్లో అర్హులు ఉంటే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలన్నారు. సెల్ సిగ్నల్స్ అందుబాటులో లేని ప్రాంతాల్లో వివరాల నమోదు కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారని, దీనిని సక్రమంగా నిర్వహిస్తే అర్హులందరికీ మేలు జరగడంతో పాటు 90 శాతానికి పైగా సమస్యలు పరిష్కారమవుతాయని రమేష్‌బాబు వివరించారు.

అవినీతికి తావు లేకుండా..

అవినీతికి తావు లేకుండా గ్రామ స్థాయిలో పరిపాలన జరుగుతుందని చెప్పడానికి చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే రమేష్‌బాబు అన్నారు. సమాజంలో సమూల మార్పులు తీసుకువచ్చి అందరికీ మేలు చేకూర్చేందుకు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువస్తే, వాటిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. ప్రస్తుతం సురక్ష పథకంలో ప్రజలకు ఉచితంగా అందిస్తున్న సేవలపై గ్రామాల్లో మైక్ ప్రచారం చేపట్టాలని రమేష్‌బాబు సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు నమోదు చేసిన సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, సర్పంచులు వెన్నా షైనీ, వెర్రీ పావని, కొక్కిలిగడ్డ భిక్షాలు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హుల వివరాలు నమోదు చేయండి..

పెడన: జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హుల వివరాలు నమోదు చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఎండీ ఖాజా అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్రతో కలిసి రెండో సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడారు. జగనన్న సురక్షలో అర్హుల వివరాలను సర్టిఫికెట్ల కోసం ఏ విధంగా నమోదు చేయాలి, ఇతర సంక్షేమ పథకాల కోసం ఎలా నమోదు చేయాలి, టోకెన్లు ఎప్పుడు, ఎవరికి ఇవ్వాలి అనే అంశాలపై పలు సూచనలు చేశారు. సీనియర్ అసిస్టెంటు సుందరం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీఓ సమావేశం

మండలంలోని నందమూరు, జింజేరు, బల్లిపర్రు సచివాలయాలను ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఈఓపీఆర్డీ ఎం. జయరాములు సందర్శించారు. నందమూరు సచివాలయంలో పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం జింజేరు, బల్లిపర్రు సచివాలయాల్లో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. సచివాలయ పరిధిలో నిర్వహించే శిబిరానికి వారం రోజులు ముందుగా టోకెన్లు ఇవ్వాలన్నారు. సర్టిఫికెట్లు ఎవరికి అయితే కావాలో వారికి, సంక్షేమ ఫలాలు అందని వారికి ఇచ్చి వారి వివరాలను యాప్‌లో నమోదు చేయడంతో పాటు వారిని శిబిరానికి ఆహ్వానించాలని సూచించారు.

విజయవంతం చేయండి..

బంటుమిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు సమన్వయంతో విజయవంతం చేయాలని మండల సచివాలయాల కన్వీనర్ కె. సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని పలు సచివాలయాల్లో మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. సమావేశాల్లో ఎంపీటీసీ పి. భగవానులు, సర్పంచ్ బి. రమేష్, డి. అవతారం, నాయకులు పాము పుష్ప, పి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

అవనిగడ్డ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు అన్నారు. మండల పరిధిలోని వేకనూరు సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడవకొల్లు మాట్లాడుతూ ప్రజలకు మరిన్ని సేవలందించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 12 రకాల సేవలకు సంబంధించి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎల్ఓ సూర్యప్రకాష్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ తుంగల లక్ష్మీ, ఎంపీటీసీ వర్రే నరేష్, మండల సచివాలయ గృహ సారథి షేక్ నజీర్‌బాషా, పంచాయతీ కన్వీనర్ గరికపాటి వెంకట కృష్ణారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా చర్యలు

కోనేరుసెంటర్: పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వ చర్యలు తీసుకుందని, ఇందుకోసం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ రూరల్ కన్వీనర్, తాళ్లపాలెం మాజీ సర్పంచ్ వాలిశెట్టి రవిశంకర్ అన్నారు. మండల పరిధిలోని తాళ్లపాలెం గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సిబ్బంది గడపకు గడపకు వెళ్లి ప్రజల అవసరాలు తెలుసుకోవాలన్నారు. అనంతరం వాటికి పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కానూరు పీఏసీఎస్ అధ్యక్షుడు నాగేశ్వరరావు (బాబు), గృహ సారథులు, వార్డు సభ్యులు, తాళ్లపాలెం సెక్రటరీ రవిశంకర్, నాయకులు, పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ

బంటుమిల్లి: సాతులూరు, చినతుమ్మిడి ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంఈఓ ఎ. వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఇటీవల ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన పాఠశాలలను సందర్శించి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక కిట్లు, నాడు–నేడు పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఎలా పనిచేస్తున్నాయో వివరించారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులపై హెచ్ఎంలు రోజారమణి, రోజాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు, పాఠశాల కమి టీ చైర్మన్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాల ఆరోపణలు
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- పాలకాయతిప్ప వద్ద డ్రెయిన్ కట్ట అభివృద్ధి పనులు ప్రారంభం



డ్రెయిన్ కట్ట అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల శ్రేయస్సు కోసం అనేక పథకాలను అమలు చేస్తూ.. వారి సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. పాలకాయతిప్ప వద్ద డ్రెయిన్ కట్ట అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. తీరప్రాంత రైతులు మురుగు సమస్యతో బాధపడకుండా సుమారు 3.5 కిలో మీటర్ల మేర డ్రెయిన్ కట్టను మెరక చేయడంతో పాటు డ్రెయిన్ పూడిక తీతను చేపడతారని చెప్పారు. ప్రభుత్వం ఈ పనుల కోసం రూ.19 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించిందని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతిపక్షాలు కావాలనే తమ పార్టీపై విమర్శలు చేస్తున్నాయన్నారు. పార్టీ టికెట్‌ను సంపాదించుకోవడానికి ప్రతిపక్ష నేతలు తాపత్రయ పడుతూ తమ నోటికి ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతుంటే చూసి ఓర్వలేక తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కోరిక మేరకు గతంలో కరకట్ట దిగువున డ్రెయిన్‌లో పూడికతీత చేపడితే ప్రతిపక్షాలు నానా రాద్ధాంతం చేశాయని, పనులు చేస్తుండగా ఆ ప్రాంతానికి రాకుండా తరువాత ప్రెస్‌మీట్‌లు పెట్టి తమకు ఇష్టమొచ్చింది మాట్లాడుతున్నారని రమేష్‌బాబు అన్నారు. పనులు జరుగుతున్నప్పుడు వచ్చి సమస్యను చెబితే బాగుంటుంది గాని పని పూర్తయిన తరువాత విమర్శలు చేయడమేమిటని రమేష్‌బాబు ప్రశ్నించారు.

రైతులను నిండా ముంచింది టీడీపీ పాలకులే..

దివిసీమ రైతులను నిండా ముంచింది టీడీపీ పాలకులేనని రమేష్‌బాబు విమర్శించారు. రైతులకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు కేటాయిస్తే వాటిని గత టీడీపీ పాలకులు దోచేసి కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా వ్యవహరించారని ఆరోపించారు. నీరు–చెట్టు పథకం ద్వారా టీడీపీ నేతలు అయినకాడికి దండుకున్నారని, జన్మభూమి కమిటీ పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ధ్వజమెత్తారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గ్రామాల్లో ఆర్‌బీకేల ద్వారా రైతులకు సేవలందిస్తూ సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తూ వారికి అండగా నిలుస్తోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కూడా తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రమేష్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ గుర్రం బసవయ్య, సర్పంచి కొక్కిలిగడ్డ భిక్షాలు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, మత్స్యకార నేత చిలకలపూడి ధర్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

సైనికుల సంక్షేమానికి రూ. 12.12 లక్షల చెక్కు అందజేత

మహిళా సంఘ సభ్యులకు కలెక్టర్ రాజాబాబు అభినందన



సైనిక సంక్షేమాధికారికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్, మహిళా సమాఖ్య సభ్యులు

చిలకలపూడి(మచిలీపట్నం): సైనికుల సంక్షేమానికి సామాజిక బాధ్యతగా జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఒక్కొక్కరు రూ. 5 చొప్పున రూ. 12,12,667 సేకరించారు. ఈ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమాధికారి కల్యాణ వీణకు మంగళవారం అందించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణకు ప్రాణాలను పణంగా పెట్టి కృషి చేస్తున్న సైనికుల సంక్షేమానికి మహిళా సంఘాలు విరాళాలు సేకరించి ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాల్లో ప్రగతి సాధించేలా ఏపీఎంలు బాధ్యత తీసుకోవాలన్నారు. సంఘాల్లో సభ్యులైన లబ్ధిదారులకు రూ. 35 వేల చొప్పున నిర్మాణానికి రుణాలు అందించామని, వారంతా ఇళ్ల నిర్మాణం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల్లో ప్రతి ఒక్కరూ వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందేలా యానిమేటర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు టి. నాగమునెమ్మ, జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల బంగారు భవిష్యత్తే లక్ష్యం



హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సురేష్ రంగబాబు

గూడూరు: చిన్నారులకు బంగారు భవిష్యత్తే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలు అమలు చేస్తున్నారని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు అన్నారు. కంకటావ జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. విద్యార్థులందరికీ విద్యా కానుక కిట్లు అందాయా లేదా అని ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా ప్రభుత్వం నిధులు జమ చేస్తోందని వివరించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులై ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గూడూరు పీఏసీఎస్ చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావు, హెచ్ఎం వి.సరళాదేవి, మాజీ సర్పంచి బొర్రా దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు వేమూరి స్వామి, పావురాల ఆంజనేయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



గుడివాడరూరల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ ఎం.రామోజీనాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ శాఖాధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. తొలుత గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు అందజేస్తున్న మెటీరియల్, ఇతర విషయాల గురించి లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులు వీలైనంత త్వరగా స్లాబ్ వేసే విధంగా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే వారికి అర్థమయ్యే రీతిలో వివరించి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టి పూర్తి అయ్యేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

వృద్ధులకు అండగా పలు చట్టాలు

న్యాయవాది సోమశేఖర్

బంటుమిల్లి: వయోవృద్ధులు, తల్లిదండ్రుల సంక్షేమానికి అనేక చట్టాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల సోమశేఖర్ (శ్యాంబాబు) అన్నారు. వృద్ధుల వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమం మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వయోవృద్ధులు, తల్లిదండ్రుల సంరక్షణకు తయారు చేసిన చట్టాలను వివరించారు. పేదలైన తల్లిదండ్రులు, వృద్ధులు ఉంటే ఎటువంటి ఫీజు లేకుండా బంటుమిల్లి బార్ అసోసియేషన్ ఉచితంగా సేవలందిస్తోందని చెప్పారు. వయోవృద్ధులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, దాని ద్వారా పిల్లల నుండి భరణం, రక్షణ పొందవచ్చని చెప్పారు. వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం సాయం కోసం హెల్ప్‌జ్ ఇండియా టోల్‌ఫ్రీ నెం: 14567ను రూపొందించిందని, బాధితులు ఈ నెంబర్ ద్వారా అధికారులకు ఫోన్ చేసి సాయం పొందవచ్చని వివరించారు. సంఘం అధ్యక్షుడు సీహెచ్ గంగాజలరావు, కార్యదర్శులు ఎస్. జనార్దన్‌రావు, కె. నాగభూషణం, జె. భాస్కరరావు, సభ్యులు పి. పద్మనాభరావు, జి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పెడన: జాతీయ రహదారి పక్కన తాళం వేసి ఉన్న ఇంట్లోకి దొంగలు ప్రవేశించి చోరీ చేశారు. ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శింగరాయపాలెం గ్రామానికి చెందిన అనుమకొండ బాలకృష్ణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. బాలకృష్ణ ఇల్లు 216 జాతీయ రహదారి పక్కన ఉంది. బాలకృష్ణ తల్లిదండ్రులు ఇటీవలే మృతిచెందడంతో నెలరోజులు వరకు వర్క్ ఫ్రం హోం చేస్తూ ఇంటి వద్దే ఉన్నాడు. వర్క్ ఫ్రం హోం ముగియడంతో నెల కిందట ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. ఇంటి తాళాలను స్థానికంగా ఉండే బంధువులకు అప్పగించాడు. బాలకృష్ణ బంధువులు రహదారిపై ఆటోలో వెళ్తూ ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండటాన్ని మంగళవారం గమనించి తాళం ఉన్న వారికి సమాచారం ఇచ్చారు. వారిరువురు వచ్చి ఇంటిని పరిశీలించారు. ఇంటి ప్రధాన ద్వారం వద్ద గడియ పగలగొట్టి ఉంది. బీరువాలోని వస్తువులు, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడవేసి ఉన్నాయి. వీరు వెంటనే పోలీసులకు, ఇంటి యజమాని బాలకృష్ణకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బంగారం, వెండి వస్తువులతో పాటు కొంత నగదు పోయినట్లు సమాచారం.

నిందితుల అరెస్ట్

ఉంగుటూరు: గొర్రెలు, మేకలను అపహరించిన వ్యక్తులపై ఉంగుటూరు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తరిగొప్పలకు చెందిన బొకినాల ప్రేమానందం, నిమ్మకూరు కిషోర్‌బాబులకు చెందిన మేకలు, గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సోమవారం రాత్రి కొందరు యువకులు మానికొండలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో వారిని విచారించగా వారు తరిగొప్పలలో రూ.50 వేల విలువగల గొర్రెలు, మేకల చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులు గన్నవరం మండలం బీబీ గూడెంకు చెందిన కిరణ్, దినేష్, వడ్డీకాసులుగా గుర్తించారు. అపహరించిన గొర్రెలు, మేకలను స్వాధీనం చేసుకున్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

నవరత్నాల అమలు కమిటీ చైర్మన్ నారాయణమూర్తి



మాట్లాడుతున్న నారాయణమూర్తి

పెనమలూరు: పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని ఏపీ నవరత్నాల అమలు కమిటీ చైర్మన్ అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి సూచించారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధి పోరంకిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. పేద వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని, వాటిపై అవగాహన కల్పించాలని నారాయణమూర్తి సూచించారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా గర్వంగా ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో జగనన్న ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని, గత ప్రభుత్వంలా ప్రజలను మోసం చేయలేదని వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయ్యేలా ఉద్యోగులు, వలంటీర్లు కృషి చేసి ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మంచినేని రమేష్, నల్లమోతు జీవన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు సాగు హక్కుపత్రాలు పొందాలి



పామర్రు: కౌలు రైతులు అందరూ పంట సాగు హక్కు పత్రాలు తీసుకోవాలని ఏఓ శివనాగ రాణి అన్నారు. మంగళవారం పామర్రులోని రైతు భరోసా కేంద్రం వద్ద భూమిలేని కౌలు రైతులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల మేలు కోసం ఎన్నో కొత్త కొత్త పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. పంట అమ్ముకోవడానికి, పంట నష్ట పరిహారం పొందేందుకు, పంటల బీమా, రైతుల పెట్టుబడి సాయం తదితరాలు కౌలు రైతులకే దక్కాలనే ఉద్దేశంతో సీసీఆర్‌సీ కార్డులను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ఎస్సీ, బీసీ మైనార్టీ వారు రైతు భరోసా పెట్టుబడి సాయం పొందవచ్చన్నారు. సాగుపత్రం ఇప్పించటం వలన భూ యజమానికి ఎటువంటి నష్టము జరగదన్నారు. పంట సాగు హక్కు పత్రం కాల పరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. మండల ఆర్‌బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, రైతులు ఆరుమళ్ల సత్తిరెడ్డి, రాజులపాటి శ్రీను, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, ఆకుల ఆంజనేయులు, దక్షిణామూర్తి, బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలి



గన్నవరంరూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రమశిక్షణగా చదివి ఉన్నతంగా ఎదగాలని జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం హెచ్ఎం కేఏస్ జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. నాడు–నేడుతో పాఠశాలల దశ మారిందని, ఈ సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో విద్యార్థులు విజయకేతనాలు ఎగురవేశారని చెప్పారు. ప్రొఫెసర్ ఎ.చంద్రశేఖరరావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు.